# గౌరవెల్లి రిజర్వాయర్‌తో రైతులకు మేలు

- జడ్పీ చైర్మన్ డాక్టర్ మారపెల్లి సుధీర్‌కుమార్
- రిజర్వాయర్ విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న మారపెల్లి సుధీర్‌కుమార్

వేలేరు, అక్టోబర్ 16 : గౌరవెల్లి రిజర్వాయర్ ప్రాజెక్ట్‌తో రైతులకు మేలు జరుగుతుందని, ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేసేందుకు రైతులు సహకరించాలని జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ మారపెల్లి సుధీర్‌కుమార్ కోరారు. నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గౌరవెల్లి రిజర్వాయర్ విస్తరణను 1.4 టీఎంసీల నుంచి 8.23 టీఎంసీలకు స్థిరీకరించేందుకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సునీత, జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అధ్యక్షతన వేలేరు, ధర్మసాగర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలకు చెందిన గ్రామస్తులు, రైతులతో సోమవారం సోడాషపల్లిలోని ఎస్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మహేందర్ జీ మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు మండలాల్లో 37వేల ఎకరాలకు ఆయకట్టు ద్వారా సాగు నీరు అందించేందుకు ఆయకటు స్థిరీకరణ, పర్యావరణ అనుమతుల కోసం అభిప్రాయాలను తెలుపాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఈ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలు వెల్లడించారు. కాగా, గతంలో భూమి కోల్పోయి నష్టపరిహారం అందని రైతులు ఎన్నికల తర్వాత తనను కలవాలని అదనపు కలెక్టర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఎస్‌ఈ సుమతిదేవి, డీఈఈలు కరుణశ్రీ, చైతన్య, ఏఈఈలు అనన్య, యశ్వంత్, వేలేరు తహసీల్దార్ హెచ్ కొమి, పీచర సర్పంచ్ రవీందర్, మల్లికుదుర్ల సర్పంచ్ రాజిరెడ్డి, వివిధ గ్రామాల కార్యదర్శులు, అధికారులు, పర్యావరణ వేత్తలు, సామాజిక వేత్తలు, ఎన్‌జీవోలు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే రాజయ్య పరామర్శ

ధర్మసాగర్, అక్టోబర్ 16 : మండలంలోని నారాయణగిరి గ్రామానికి చెందిన ఎడుదొడ్ల రాజిరెడ్డి(90) సోమవారం అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే రాజయ్య పరామర్శించారు. రాజిరెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నారాయణగిరి సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కర్ర సోమిరెడ్డి, తిరుమల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘు, లాల్, కుమార్, మొగిలి, రమేశ్ ఉన్నారు.



నామినేషన్ పత్రం అందజేస్తున్న అభ్యర్థి వీరన్న

## 'ముల్కనూరు' సంఘం ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ

భీమదేవరపల్లి, అక్టోబర్ 16 : ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం ఎన్నికల్లో 11 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి నీరజ తెలిపారు. సంఘంలో మొత్తం 15 డైరెక్టర్ స్థానాలుండగా 4, 6, 10, 11, 13 నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం సంఘం ప్రధాన కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిచారు. 4వ నియోజకవర్గంలో బొల్లేపల్లి వీరన్న(ముస్తఫాపూర్), జిమ్మల భీంరెడ్డి(వంగర), 6లో కర్రె మహేందర్(గోపాల్‌పూర్), అన్నం తిరుపతిరావు(గోపాల్‌పూర్), 10లో మండ శ్రీనివాస్(కొప్పూరు), చీకట్ల రాజయ్య(మల్లారం), 11లో గుగులోత్ బాషు(మల్లారం), బానోత్ కిషన్(ముస్తఫాపూర్), 13లో చవ్వాల బుచ్చయ్య(వంగర), గద్ద అయిలయ్య(కొప్పూరు), మీస మహేశ్(కొత్తపల్లి) నామినేషన్లు దాఖలు చేసినట్లు వెల్లడించారు.

## 'స్థానికేతరులకు టికెట్ ఇస్తే సహించేది లేదు'

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 16 : పరకాల టికెట్‌ను స్థానికేతరులకు ఇస్తే సహించేది లేదని పరకాల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చేవారికి టికెట్ ఇస్తే ఊరుకోమని, స్థానికేతరులకు ఇచ్చి కార్యకర్తలకు అన్యాయం చేయవద్దని అధిష్టానాన్ని కోరారు. సమావేశంలో నాయకులు భీమాగాని సౌజన్య, ఒంటేరు రామ్మూర్తి, బొమ్మల కట్టయ్య, మల్లారెడ్డి, రాజేశ్వర్‌రావు, గాదె శంకరయ్య, గుండేటి ఎల్లయ్య పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేవైఎం కార్యకర్తలు



ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కార్యకర్తలు

కమలాపూర్, అక్టోబర్ 16 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేవైఎం కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కోసం ఉప ఎన్నికల్లో కష్టపడి పని చేశామని, ఆయన గెలిచి రెండేళ్లవుతున్నా ఏనాడు తమ గురించి పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మికుంట అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేసి, బీఆర్‌ఎస్‌లో చేరడంతో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో జనగాని రాకేశ్, మార్క అరవింద్, ప్రమోద్‌రెడ్డి, అశోక్, అజయ్, రాజు, యుగేంధర్, సుమన్, మహేశ్ తదితరులున్నారు.

## నేటి నుంచి 'అంబేద్కర్' బీఈడీ తరగతులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 16 : అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో చేరిన బీఈడీ ట్రైనీస్‌కి 17 నుంచి 21 వరకు తరగతులు నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ రవ్వ విజయలక్ష్మి తెలిపారు. హనుమకొండ లష్కర్‌బజార్‌లోని బీఈడీ కాలేజీలో ఉదయం 9.30 నుంచి 5 గంటల వరకు తరగతులు జరుగుతాయని, తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు.

## '28లోగా విద్యార్థుల వివరాలు సరి చేసుకోవాలి'

హనుమకొండ సిటీ, అక్టోబర్16 : పదో తరగతి విద్యార్థుల వివరాల్లో తప్పులు ఉంటే ఈ నెల 28లోగా యుడైస్ పోర్టల్‌లో సరి చేసుకోవాలని డీఈవో ఎండీ అబ్దుల్ హై ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది యుడైస్ పోర్టల్‌లోని వివరాల ఆధారంగా పరీక్షలు నిర్వహిస్తున్నందున వివిధ యజమాన్యాల ప్రధానోపాధ్యాయులు అడ్మిషన్ రిజిస్టర్‌లోని వివరాలను యుడైస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

## కమలాపూర్‌లో యాచకుడి మృతి

కమలాపూర్, అక్టోబర్ 16 : మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆరెల్ల బజార్ (60) అనే యాచకుడు మృతి చెందినట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. కొంతకాలంగా ఆరెల్ల బజార్ కమలాపూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో భిక్షాటన చేసి, జీవనం కొనసాగించేవాడన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అతడికి బంధువులు ఎవరూ లేరని గుర్తించి, పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

## రైల్వే ఈసీసీఎస్ పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు

కాజీపేట, అక్టోబర్ 16 : దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో జరుగుతున్న రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెటిట్ సొసైటీ(ఈసీసీఎస్) పోస్ట్ బ్యాలెట్ ఎన్నికలు సోమవారం జరిగాయి. ఈ నెల 19న జరుగున్న ఎన్నికలను పురస్కరించుకుని విధుల్లో దూర ప్రాంతాలకు వెళ్లే రైల్వే కార్మికుల కోసం పోస్టల్ బ్యాలెట్ పక్రియను కాజీపేట పరిధిలో ఏర్పాటు చేశారు. అయితే, ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వారికి అభ్యర్థులు తమ గుర్తును చూపిస్తూ ఓటు వేయాలని అభ్యర్థించడంతో ఆయా కార్మిక సంఘాలు అభ్యంతరం తెలిపారు. దీంతో అభ్యర్థుల మధ్య వాగ్వాదం జరిగింది.

## ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా విల్సన్

కాజీపేట, అక్టోబర్ 16 : ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా కాజీపేటకు చెందిన జేరిపోతుల విల్సన్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కల వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. విల్సన్ సేవలను గుర్తించి ఈ పదవిని కట్ట బెట్టినట్లు పేర్కొన్నారు. కాగా, తనకు పదవి రావడానికి సహకరించిన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బీఎన్ రమేశ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కల వెంకటస్వామి, కార్యదర్శి, ఉపాధ్యక్షులు రామంచ సారంగపాణి, గద్దల కుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుర్రపు శ్యాం, జిల్లా అధికార ప్రతినిధి తక్కలపల్లి రాజు, జిల్లా మీడియా కన్వీనర్ దాసరపు సాయన్న , హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మామునూరు భాస్కర్ మాదిగ, ఉపాధ్యక్షుడు జేరిపోతుల కరుణాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పకడ్బందీగా ఎన్నికలకు ఏర్పాట్లు

- పది మొబైల్ చెక్‌పోస్టు టీంలు
- ఇప్పటి వరకు రూ.94లక్షల నగదు సీజ్
- త్వరలోనే పారామిలటరీ బలగాలు
- సీపీ అంబర్ కిశోర్ ఝూ



సుబేదారి, అక్టోబర్ 16 : రాష్ట్ర అంసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పక్బందీగా ఏర్పాట్లకు చర్యలు తీసుకున్నామని పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ తెలిపారు. సోమవారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి భద్రతను మరింత కట్టుదిట్టం చేశామన్నారు. ప్రత్యేక తనిఖీ బృందాలు, స్థానిక పోలీసులు కలిసి ఇప్పటి వరకు కమిషనరేట్ పరిధిలో రూ.94,74,994 నగదు, రూ.6.57లక్షల విలువైన మద్యం, రూ.6.39లక్షల విలువైన బెల్లం, రూ.11.90లక్షల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నామని సీపీ పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులతో పాటు, 10 మొబైల్ చెక్‌పోస్ట్ టీంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్ టీంలు 24 గంటలూ తిరుగుతుంటాయన్నారు. ఓటర్లకు ఎక్కడైనా డబ్బులు కానీ, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని సీపీ సూచించారు. లైసెన్స్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. రౌడీషీటర్లను బైండోవర్ చేస్తున్నామని తెలిపారు. పోలీసుల తనిఖీల్లో డబ్బులు పట్టుబడితే వెంటనే తగిన ఆధారాలు చూపించాలని సీపీ సూచించారు. ఎన్నికల కోసం వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు త్వరలోనే కేంద్ర పారామిలటరీ బలగాలు రానున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని సీపీ అంబర్ కిశోర్ ఝూ కోరారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## ఆత్మీయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిది

### నల్సార్ లా విశ్వవిద్యాలయం వీసీ కృష్ణదేవరావు

ధర్మసాగర్, అక్టోబర్ 16 : పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిదని మండలంలోని పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, నల్సార్ లావిశ్వవిద్యాలయం వీసీ కృష్ణదేవరావు అన్నారు. ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామంలో 1974-75 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 48 ఏళ్ల తర్వాత స్నేహితులంతా ఒకే వేదికపై కలుసుకుని ఒకరినొకరు ఆత్మీయగా పలకరించుకున్నారు. నాడు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నల్సార్ లా విశ్వవిద్యాలయం వీసీ కృష్ణదేవరావు పాల్గొని ఉదయం నుంచి సాయంత్రం వరకు స్నేహితులతో సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని స్నేహితులతో కలిసి తీర్మానాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ హెడ్‌మాస్టర్ వరదారెడ్డి, ఉపాధ్యాయులు రాధాకిషన్ శాస్త్రి, కుమారస్వామి, సింగారెడ్డి, ప్రస్తుత హెచ్‌ఎం రాజేందర్, వ్యాపారవేత్త సురేందర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపుల్లో మద్యం స్వాధీనం

ధర్మసాగర్, అక్టోబర్ 16 : మండలంలోని దేవునూర్, పెద్దపెండ్యాల గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై ధర్మసాగర్ సీఐ శ్రీధర్‌రావు సోమవారం రాత్రి దాడులు చేశారు. దేవునూర్ గ్రామంలో ఆమెలి రాజేశ్వర్‌రావు బెల్ట్‌షాపులో రూ.14,800 విలువ గల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన పబ్బ వెంకటేశ్వర్లు బెల్ట్‌షాపును తనిఖీ చేసి, రూ.9,905 విలువ గల మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్సైలు ఫిలిప్, రాజు, హెడ్‌కానిస్టేబుల్ సలీం పాషా, కానిస్టేబుల్ కరుణాకర్ పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి గాయాలు

ధర్మసాగర్, అక్టోబర్ 16 : మండలంలోని ఎర్రబెల్లికి చెందిన గీత కార్మికుడు కంకటి క్ష్మీనారాయణకు తాడిచెట్టుపై నుంచి కిందపడి గాయాలయ్యాయి. వృత్తి రీత్యా చెట్టు ఎక్కే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు తోటి కార్మికులు, కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స కోసం 108లో కాజీపేటలోని దవాఖానకు తరలించారు. ఎడమకాలు విరిగినట్లు వైద్యులు గుర్తించి, మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం దవాఖానకు తరలించారు.